క్లుప్తంగా

30న బహిరంగ వేలం

నందిగామటౌన్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్‌లకు ఈనెల 30, 31వతేదీల్లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం రెండుగంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగినవారు వేలంలో పాల్గొనాలని ఈఓ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయి కోరారు.

120 మందికి కంటి పరీక్షలు



కీసర(కంచికచర్ల): రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ప్లాజా యాజమాన్యం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించింది. టోల్‌ప్లాజా సిబ్బంది, పలు వాహనాల డ్రైవర్లు పాల్గొని కంటి శుక్లాలు, పొరలు పరీక్షలు చేయించుకున్నారు. వైద్యసిబ్బంది మొత్తం 120మందికి కంటి పరీక్షలు చేసి, కంటి ఆపరేషన్‌ను అవసరమైన వారిని గుర్తించారు. వారిని గుంటూరు సమీపంలోని శంకర కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో సీఓఎం రాజారావు, మేనేజర్ జయప్రకాష్, సేఫ్టీ అధికారి శ్రీనివాస్, ఆర్ఈ బాలాజీశర్మ, సెక్యూరిటీ మేనేజర్ ఉమా మహేశ్వరరావు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

జనన మరణాలను నమోదు చేయాలి

జగ్గయ్యపేటఅర్బన్: జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు వారి ఆస్పత్రుల్లో జననం జరిగిన మూడు రోజుల్లో ఆన్‌లైన్ చేసి జనన రిపోర్టు ఫారం-1 ద్వారా పురపాలక సంఘానికి తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు శుక్రవారం సూచించారు. పట్టణంలోని ప్రజల ఇంటి వద్ద ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు జరిగిన వెంటనే సదరు మరణం వివరాలు ఫారం-2 ద్వారా పురపాలక సంఘ కార్యాలయంలో నమోదు చేసుకుంటే ఉచితంగా ధ్రువీకరణపత్రం అందజేస్తామని ఆయన వివరించారు.

డిజిటల్ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): డిజిటల్ యుగంలో వ్యక్తిగత సమాచార భద్రత అత్యంత కీలకమని సైబర్ సెక్యూరిటీ నిపుణుడు నితిన్ పాండే అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, గూగుల్.ఓఆర్ జి సహకారంతో కేబీఎన్ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో 'ఫ్యాక్ట్ చెకింగ్ ఇన్ డిజిటల్ ఏజ్' అంశం మీద రెండు రోజుల సదస్సును ఆ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న నితిన్ పాండే మాట్లాడుతూ డిజిటల్ సవాళ్ళను ఎదుర్కోవటం కోసం డీప్‌ఫేక్‌లు, నకిలీ వార్తలను గుర్తించగలిగిన నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. ఎథికల్ హ్యాకింగ్ ఇటీవల అధిక ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. తప్పుడు సమాచారం అంతర్జాలం ద్వారా విపరీతంగా వ్యాపిస్తోందని చెబుతూ, దాన్ని గుర్తించే విధానాన్ని అనేక ఉదాహరణలతో వివరించారు. ప్రజెంటేషన్ల ద్వారా పాండే వివరించిన తీరు విద్యార్థులను డిజిటల్ భద్రత దిశగా చైతన్యవంతులను చేసింది. సైబర్ సురక్షా విధానాలను అనుసరించడం ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని అత్యంత భద్రంగా ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి రవీంద్ర పాల్గొన్నారు.

కనులపండువగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): స్థానిక పూర్ణానందంపేటలోని కోదండరామ దాసాంజనేయస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఆధ్యాత్మికవేత్త, ఆలయ ట్రస్ట్ కన్వీనర్ వేముల హజరత్తయ్య గుప్తా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కోదండరామ దాసాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో 37 సంవత్సరాల క్రితం పులిపాటి దుర్గారావు, కోటేశ్వరమ్మ దంపతులచే శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారి వారసులు దుర్గాప్రసాద్ విజయకుమారి, సాయిరామ్ ఉషారాణి దంపతులు స్వామి వార్ల చేతుల మీదుగా స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాలు కలిగి ఉండాలని శ్లోక భావయుక్తంగా తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసదాలు, అన్నప్రసాదాన్ని అందజేశారు.

ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయాలు

- 15 సచివాలయాల్లో 91మందే సిబ్బంది
- డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లిన పలువురు ఉద్యోగులు
- సెలవుల్లో మరికొందరు ఉద్యోగులు
- ఎంపీడీఓ తీరే కారణమని గుసగుసలు



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న గుమ్మడిదుర్రు సచివాలయం

పెనుగంచిప్రోలు: మండలంలో పలు సచివాలయాలు సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో పనిభారం కేవలం అక్కడ ఉన్న ఒకరిద్దరి సిబ్బందిపైనే పడుతోంది. సరిపడినంతమంది ఉద్యోగులు లేకపోవడంతో ఆయా సమస్యల పరిష్కారం కోసం వెళ్లే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని సచివాలయాలు సిబ్బంది, ప్రజలతో నిత్యం కళకళలాడుతుండేవని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

భర్తీ కాని ఉద్యోగుల స్థానాలు..

పెనుగంచిప్రోలు మండలంలో మొత్తం 15 సచివాలయాలు ఉండగా ఆయాశాఖలకు సంబంధించి ఒక్కో సచివాలయానికి 11మంది చొప్పున 165 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉంది. అయితే అన్ని సచివాలయాల్లో కలిపి 105 మంది పనిచేస్తున్నట్లు అధికారిక గణాంకాలు చూపిస్తున్నా, క్షేత్రస్థాయి విధుల్లో అంత మంది లేరు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందిలో కొంతమంది డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లగా, వివిధ కారణాలతో మరికొందరు ఉద్యోగులు దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. వ్యక్తిగత అవసరాలు, అనారోగ్యం రీత్యా సాధారణంగా పలువురు సిబ్బంది సెలవు పెడుతూ ఉంటారు. డెప్యూటేషన్‌పై వెళ్లిన ఉద్యోగుల స్థానంలో కొత్తవారు ఎవ్వరూ ఇక్కడ చేరకపోవడంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఖాళీల వివరాలు ఇలా..

ప్రస్తుతం గుమ్మడిదుర్రు సచివాలయంలో ఐదుగురు సిబ్బంది ఉండగా ఒకరు డెప్యూటేషన్‌పై వెళ్లగా ఒకరు సెలవులో ఉన్నారు. అనిగండ్లపాడు-1 సచివాలయంలో ఆరుగురు ఉద్యోగులు, సచివాలయం-2లో ఆరుగురు ఉద్యోగులు ఉన్నారు. కొణకంచి సచివాలయంలో ఏడుగురు సిబ్బంది ఉండగా, ఒకరు డెప్యూటేషన్‌పై వెళ్లారు. ముచ్చింతాల సచివాలయంలో ఆరుగురు సిబ్బంది ఉండగా ఇద్దరు మహిళా ఉద్యోగులు మెటర్నటీ సెలవులో ఉన్నారు. ముండ్లపాడు సచివాలయంలో ఐదుగురు సిబ్బంది ఉండగా ఒకరు విధులకు గైర్హాజరవుతున్నారు. నవాబుపేటలో ఐదుగురు సిబ్బంది ఉండగా ఒకరు డెప్యూటేషన్‌పై వెళ్లారు. పెనుగంచిప్రోలు-1 సచివాలయంలో నలుగురు సిబ్బంది ఉండగా ఒకరు విధులకు హాజరుకావడం లేదు. పెనుగంచిప్రోలు-2 సచివాలయంలో నలుగురు సిబ్బంది ఉండగా ఒకరు సెలవులో ఉన్నారు. శనగపాడులో ఏడుగురు, శివాపురం సచివాలయంలో ఏడుగురు సిబ్బంది ఉండగా ఇద్దరు సెలవులో ఉన్నారు. సుబ్బాయిగూడెంలో ఆరుగురు, వెంకటాపురం సచివాలయంలో ఏడుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారు.

మండలానికి పంచాయతీ కార్యదర్శులుగా 15మంది ఉండాల్సి ఉండగా, గ్రేడ్-1 ఒకరు, గ్రేడ్-5 ఆరుగురు, గ్రేడ్-2 ఒకరు ఉన్నారు.ఇలా సగం మంది ఉద్యోగుల కొరత ఉండటంతో ఉన్నవారే రెండుమూడు పంచాయతీల బాధ్యతలు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎంపీడీఓ తీరే కారణమా?..

సచివాలయ ఉద్యోగుల్లో పలువురు ఇతర ప్రాంతాలకు డెప్యూటేషన్‌పై వెళ్లడానికి ఎంపీడీఓ దురుసుగా మాట్లాడుతుండటమే కారణమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎంపీడీఓ తీరు కారణంగా ఇటీవల ఓ మహిళా ఉద్యోగి ఎంపీపీ ఎదుట కన్నీటి పర్యంతమైన సంఘటన సచివాలయ, మండల పరిషత్ కార్యాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ తీరు కారణంగా ఇప్పటికే ఆయా సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీకి నోచుకోని నేపథ్యంలో ఎంపీడీఓ తీరుతో ఉన్న ఉద్యోగుల్లో కొందరు డెప్యూటేషన్ పై..మరికొందరు సెలవుపై..ఇంకొందరు పూర్తిగా విధులకు దూరంగా ఉంటుండటంతో మండలంలోని ఆయా సచివాలయాలు ఉద్యోగులు లేక ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

హోటళ్లలో అధికారుల తనిఖీలు





హోటళ్లలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

నిల్వ ఉన్న చికెన్, మటన్ గుర్తింపు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ పరిధిలో ఉన్న పలు హోటళ్లలో మున్సిపల్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక కాకతీయ రెస్టారెంట్, వెంకటసాయి హోటల్, ఎన్ హోటల్, ఆంధ్ర కేఫ్ హోటళ్లలో తనిఖీలు నిర్వహించి పాడైన, నిల్వ ఉన్న చికెన్, మటన్, పన్నీరు, మంచూరియాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని చెత్తబుట్టలో పడేశారు. ఈసందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రాంబాబు మాట్లాడుతూ పాచిపోయి, నిల్వ ఉన్న ఆహారపదార్థాలను హోటళ్లలో ఉపయోగిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడినా, మరలా ఇలాంటివి పునరావృతం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా హోటళ్ల యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ మేస్త్రులు, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

వీరులపాడు: మద్యం దుకాణాల రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా గౌడ సామాజికవర్గానికి వీరులపాడు మండలంలో కేటాయించిన మద్యం దుకాణం కోసం అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కంచికచర్ల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ అఫ్రవున్నిసా బేగం శుక్రవారం సూచించారు. దరఖాస్తుదారులు తమ కుల, నివాస ధ్రువీకరణపత్రాలను జతచేయాలన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ.రెండు లక్షల నాన్ రిఫండబుల్ ఫీజును చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను ఈనెల 27వతేదీ నుంచి ఫిబ్రవరి 5వతేదీలోగా అందజేయాలన్నారు. ఫిబ్రవరి 7న డ్రా తీసి షాపును కేటాయిస్తామని వివరించారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్‌సీఐ సూచించారు.

వ్యక్తికి గాయాలు

నందిగామటౌన్: పొలం సరిహద్దు వివాదంలో జరిగిన దాడిలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు..మండలంలోని చందాపురం గ్రామానికి చెందిన గద్దె ఆంజనేయ ప్రసాద్, గద్దె నరసింహారావు మధ్య కొంతకాలంగా వ్యవసాయ భూమి సరిహద్దు వివాదాలున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సమయంలో సరిహద్దులు చూపుతాను రావాలని గద్దె ఆంజనేయ ప్రసాద్‌ను వ్యవసాయ భూమి వద్దకు తీసుకెళ్లి గద్దె నరసింహారావు, మరి కొంతమంది వ్యక్తులు కలిసి గొడ్డలి, కర్రలతో దాడిచేయడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడు నందిగామ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై డ్రైవర్లకు అవగాహన

నందిగామటౌన్: రోడ్డు భద్రతా నియమాలకు అనుగుణంగా వాహనాలను నడిపితే రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చని నందిగామ రవాణా శాఖాధికారి పద్మావతి అన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా పట్టణంలోని పీఎస్‌సి బోస్ మెమోరియల్, శ్రీఅన్నపూర్ణ హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న డ్రైవర్లకు శుక్రవారం రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వేగం, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతుండటమే ప్రమాదాలకు ప్రధాన కారణమన్నారు.

వాహనదారులంతా రోడ్డు భద్రతా నియమాలకు అనుగుణంగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏసీపీ తిలక్, సీఐ వైవిఎల్ నాయుడు, ఎంవీఐలు రాజు, పూర్ణిమ, ఎస్ఐ అభిమన్యు, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, పరిపాలన అధికారి ప్రభాకర లింగం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నందిగామ ఎంవీఐ పద్మావతి

జాతీయ క్రీడలకు వెళ్లిన రాష్ట్ర బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు



విజయవాడ స్పోర్ట్స్: ఉత్తరా ఖండ్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 38వ జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ బీచ్ హ్యాండ్‌బాల్ జట్టు శుక్రవారం పయనమైనట్లు ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.సత్యనారాయణరాజు తెలిపారు. జట్టులో చోటు దక్కించుకున్న ఎన్.రాము(విశాఖపట్నం), ఎస్.అమీర్(విశాఖపట్నం), కె.శ్రీను(విశాఖపట్నం), ఎ.జగదీష్(కర్నూలు), కె.శివకుమార్(కర్నూలు), ఆర్.రియాజ్(కర్నూలు), ఎం.స్వామినాథన్(ప్రకాశం), కె.పవన్‌కల్యాణ్(చిత్తూరు), ఎల్.జనార్ధనరెడ్డి(గుంటూరు), ఇ.రాజు(అనంతపురం) విజయవాడ నుంచి బయలుదేరారు. ఈ బృందానికి ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్(ఏపీవోఏ) అధ్యక్షుడు ఆర్.కె.పురుషోత్తం ట్రాక్‌షూట్, కిట్లు, జెర్సీలు సమకూర్చారని, అలాగే తమ సంఘం ప్రయాణ ఖర్చులను సమకూర్చిందని సత్యనారాయణరాజు తెలిపారు. జట్టు బృందాన్ని కృష్ణాజిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వంశీకృష్ణ, కోచ్ గోపీకృష్ణ అభినందించారు.

ముంచెత్తుతున్న మంచు

వత్సవాయి: మండలంలో నాలుగు రోజులుగా మంచు ముంచెత్తుతోంది. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ఉదయం పది గంటల వరకు కూడా మంచుపొరలు తొలగడం లేదు. ఏకధాటిగా వర్షం పడినట్లు తుప్పర పడుతోంది. దీంతో ఉదయం పనులకు వెళ్లే కూలీలు, కార్మికులు ఉద్యోగులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయదారులు మంచులోనే పొలం పనులకు వెళ్లక తప్పడం లేదు. మంచు ధాటికి వాహనాలను నడపలేక కొందరు డ్రైవర్లు వాహనాలను రోడ్డు పక్కన నిలిపివేస్తున్నారు. ఇదేవిధంగా మరో పదిరోజులు మంచు కురిస్తే మిర్చి, మామిడి పంటలకు తీరని నష్టమని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పెనుగంచిప్రోలు రోడ్డులో ఉదయం 9గంటల సమయంలోనూ దట్టంగా కమ్ముకున్న మంచు

వేడుకగా సావిత్రి సినీ జీవిత వజ్రోత్సవం

విజయవాడ కల్చరల్: నడిచే నట గ్రంథాలయం మహానటి సావిత్రి అని సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం సినీ నటి సావిత్రి సినీ వజ్రోత్సవం, సినీ సంగీత విభావరి, మహానటి సావిత్రి జాతీయ స్మారక పురస్కారాల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి కళాపీఠం ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో నాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రియేటివ్ కల్చరల్ చైర్‌పర్సన్ తేజస్వి మాట్లాడుతూ కళా సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రభుత్వం ద్వారా సహకరిస్తామని పేర్కొన్నారు. సావిత్రి లక్షలాది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. నిర్వాహకులు నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణను, ఏపీ క్రియేటివ్ చైర్‌పర్సన్ చైర్మన్‌కు మహానటి సావిత్రి జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన కే దేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్, దామోదర గణపతిరావు తదితరులు పాల్గొన్నారు. సావిత్రి నటించిన చిత్రాల్లోని 40 పాటల పల్లవులను నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు విష్ణుప్రియ, సుధాశ్రీనివాస్, కల్యాణి, ప్రజ్ఞ, సత్యవర్ధన్, రసూల్‌బాబు ఆలపించారు.



గుమ్మడి గోపాలకృష్ణ, తేజస్వికి సావిత్రి జాతీయ పురస్కారాలు అందజేస్తున్న నిర్వాహకులు

భారతీ తీర్థస్వామి జయంతి వేడుకలు ప్రారంభం



నవచండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థమహాస్వామి జన్మదిన వేడుకలు దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను 75 రోజులపాటు నిర్వహించనున్నారు. తొలుత వేదపండితులు జగద్గురు ఆదిశంకరుల విగ్రహాలకు పూజాదికాలు నిర్వహించారు. వేద పారాయణం, షోడశ పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతి మహాస్వామి ఆదేశంతో లోక సంరక్షార్థం నవచండీ హోమం, రుద్ర పారాయణం చేశారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ నవచండీ హోమం అత్యంత శక్తివంతమైనదని తెలిపారు. లోకమాత చండీదేవిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని వివరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా అంబటిపూడి రాధేశ్యాం గణేష పురాణం అంశంగా ప్రసంగించారు.

రియల్ వ్యాపారికి నోటీసులు



నేషనల్ హైవే పక్కన అనుమతుల్లేని వెంచర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ జాహ్నవి

కంచికచర్ల: రెవెన్యూశాఖ ఆదాయానికి గండికొడుతూ అక్రమంగా లేఅవుట్లు వేస్తే ఉపేక్షించేది లేదని తహసీల్దార్ పి.జాహ్నవి స్పష్టం చేశారు. కంచికచర్ల నేషనల్ హైవే పక్కన అనుమతులు లేకుండా వేసిన వెంచర్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. అనంతరం సదరు రియల్‌ఎస్టేట్ వ్యాపారికి నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ జాహ్నవి మాట్లాడుతూ అక్రమంగా వెంచర్లు వేస్తే ఆసర్వేనంబర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామన్నారు. వ్యవసాయ భూములను కమర్షియల్(నాన్ అగ్రికల్చర్ ల్యాండ్)గా మార్చాలంటే కన్వర్షన్ ప్రక్రియ తప్పనిసరి అన్నారు. ల్యాండ్ కన్వర్షన్ చేసేందుకు ఏపీ సీఆర్డీఏ లేదా రెవెన్యూ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లలో డ్రైయినేజీ మంచినీటి సౌకర్యం, విద్యుత్ లైన్లు, ఇళ్ల నిర్మాణాలు, పాఠశాల అంగనవాడీ భవనాలు, కమ్యూనిటీ హాలు, పార్కు, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలు తదితర మౌళిక వసతుల కోసం రిజర్వు స్థలాలను కేటాయించాల్సిందేనని స్పష్టంచేశారు. ఇటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఇష్టారాజ్యంగా లేఅవుట్లు వేసి స్థలాలను విక్రయించరాదని హెచ్చరించారు. ఆమె వెంట ఆర్ఐ వెంకట్, వీఆర్వో శేషం సురేష్ బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిరునాళ్ల నాటికి నిర్మాణాలు పూర్తి :ఈఓ



భవనంలో పనుల పరిస్థితిని పరిశీలిస్తున్న ఈఓ కిషోర్‌కుమార్, ఈఈ రమ

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ ఆలయం వద్ద రూ.3.75 కోట్లతో నిర్మిస్తున్న కేశఖండనశాల, టాయిలెట్ బ్లాక్‌తోపాటు భక్తుల విరాళం రూ.కోటితో నిర్మిస్తున్న డార్మెటరీ నిర్మాణ పనులను వచ్చే నెల నిర్వహించే తిరునాళ్ల సమయానికి పూర్తిచేస్తామని ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ తెలిపారు. ఆయా నిర్మాణపు పనులను ఆలయ ఈఈ ఎల్ రమతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. నిర్మాణాలు పూర్తయ్యాయని రంగులు, ఫ్లోరింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. ఫిబ్రవరి లేదా మార్చిలో జరిగే తిరునాళ్ల ఉత్సవాల సమయానికి ఈ నిర్మాణాలు భక్తులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తున్నామన్నారు. ఆలయ ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు అంబులెన్స్‌లను ప్రోత్సహించవద్దు: సీపీఐ



ఆస్పత్రి సూపరిండింటెంట్ డాక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో కొందరు వ్యక్తులు ప్రైవేటు అంబులెన్స్‌లను ప్రోత్సహిస్తూ రోగులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు అన్నారు. ప్రైవేట్ అంబులెన్స్‌లనుప్రోత్సహించవద్దని కోరుతూ ఆపార్టీ నాయకులు శుక్రవారం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రి సూపరిండెంట్ ఆళ్ల హరీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జూనెబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ యాక్సిడెంట్లు, ఎమర్జెన్సీ సమయాల్లో బాధితులను విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించే క్రమంలో పలువురు ఆస్పత్రి సిబ్బంది ప్రైవేట్ అంబులెన్స్‌లను ప్రోత్సహిస్తున్నారన్నారు. దీంతో రోగుల కుటుంబాలపై ఆర్థికంగా భారంపడుతుందన్నారు. రోగులను మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించేప్పుడు 108వాహనం, కోహెన్స్ ఫార్మా అందించిన అంబులెన్స్‌లనే వినియోగించాలని కోరారు. తద్వారా బాధిత కుటుంబాలపై ఆర్థికభారం ఉండదని గుర్తుచేశారు. విజయవాడ, ఖమ్మం తదితర పట్టణాలలోని ప్రైవేటు ఆస్పత్రుల వారు డబ్బు ఆశ జూపుతుండటంతో పలువురు ప్రైవేటు అంబులెన్స్‌ల డ్రైవర్లు పేషంట్లను ప్రభుత్వాస్పత్రులకు తీసుకువెళ్లకుండా ప్రైవేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రభుత్వాస్పత్రి నుంచి పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందకపోగా, పేదలు ప్రైవేటు ఆస్పత్రుల్లో పాలై బిల్లులు కట్టలేక అప్పుల పాలవుతున్నారని వివరించారు.

విజయవాడ ప్రభుత్వాస్పత్రికి సిఫార్సు చేసిన పేషంట్‌ను అక్కడ ఆస్పత్రిలో చేర్పించిన తర్వాత సదరు అంబులెన్స్ డ్రైవర్ విజయవాడ ఆస్పత్రి వారి నుంచి ఎకనాలెడ్జ్‌మెంటును తెచ్చి తిరిగి జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో అందించేలా చూడాలన్నారు. ఈ విధానాన్ని అమలు చేస్తే పలువురు ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ల కారణంగా నష్టపోతున్న పేషంట్ల కుటుంబాలను కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు. ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరిండింటెంట్‌ను కోరారు కార్యక్రమంలో సీపీఐ సీపీఐ పట్టణ నాయకులు మెటికల శ్రీనివాసరావు, వై.భాను పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఆలయ కల్యాణ మండపం

- రూ.1.80కోట్లతో నిర్మాణం..
- కిచెన్ షెడ్, డైనింగ్‌హాలు కొరత
- నిరుపయోగంగా మారిన కల్యాణమండపం



నిరుపయోగంగా మిగిలిన కల్యాణ మండపం

పెనుగంచిప్రోలు: తగిన వసతులు లేని కారణంగా స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి చెందిన మునేరు అవతల మామిడి తోటలో రూ.1.80 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపం నిరుపయోగంగా మారింది. కల్యాణ మండపంలో డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ ఏర్పాటు చేయకపోవడంతో కల్యాణమండపం పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మొదట నాన్ ఏసీ కల్యాణ మండపం కింద నిర్మాణం చేపట్టిన ఆలయ అధికారులు, తీరా ఇప్పుడు ఏసీ కల్యాణ మండపంగా మార్చాలని నిర్ణయించడం గమనార్హం. వంట షెడ్డు లేని కారణంగా ఇదేస్థలంలో గతంలో రూ.15లక్షలతో నిర్మించిన ఓపెన్ ఆడిటోరియం నిరుపయోగంగా మారడంతో దానిని కూల్చివేశారు. కాని కల్యాణమండపంలో కిచెన్‌షెడ్, డైనింగ్ హాలు ఏర్పాటు చేసే విషయంలో మాత్రం తీవ్రజాప్యం చేస్తున్నారు. ఇకనైనా ఆలయ అధికారులు స్పందించి కల్యాణమండపానికి అనుబంధంగా కిచెన్‌షెడ్, డైనింగ్‌హాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రైవేట్ కల్యాణ మండపాల అద్దె భారం నుంచి భక్తులను కాపాడాలని వారు కోరుతున్నారు.

రూ.2.50కోట్లతో అంచనాలు..



కల్యాణ మండపం పక్కన డైనింగ్ హాల్, కిచెన్ షెడ్‌తోపాటు ఏసీ ఏర్పాటుకు కూడా అంచనాలు తయారుచేసి దేవదాయశాఖ ఉన్నతాధికారులకు పంపించాం. ఎలక్ట్రిఫికేషన్, జనరేటర్లు, ఇతర మౌలికసదుపాయాలన్నింటికీ కలిపి రూ.2.50కోట్లతో అంచనాలు తయారు చేశాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం. -ఎల్ రమ, ఆలయ ఈఈ

పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు

విజయవాడస్పోర్ట్స్: కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం 150 మంది అధికారులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రశంసా పత్రాలను అందజేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు(హిట్ అండ్ రన్ కేసుల్లో) జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి నష్టపరిహారం అనతి కాలంలోనే అందేలా చర్యలు తీసుకున్న, హెల్మెట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించిన, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి చలానా రుసుమును వసూలు చేసిన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన పోలీసు అధికారులను, సిబ్బందిని సీపీ రాజశేఖరబాబు అభినందించారు. కార్యక్రమంలో డీసీపీలు తిరుమలేశ్వర రెడ్డి, ఇన్‌చార్జ్ అడ్మిన్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ట్రాఫిక్ ఏసీపీ పి.రామచంద్రరావు, నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ పాల్గొన్నారు.